క్లుప్తంగా

ఘనంగా సంగీత దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న కళాకారులు

గోదావరిఖనిటౌన్: స్థానిక సింగరేణి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం స్ఫూర్తి భవన్‌లో శుక్రవారం ప్రపంచ సంగీత దినోత్సవం గోదావరి కళా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు లలిత గీతాలు, సినిమా పాటలను ఆలపించారు. అనంతరం కళా రంగానికి సేవలు అందిస్తున్న పోతుగంటి భీమయ్య చారి, బండారి వీరేంద్ర, పానుగంటి వెంకటేశ్వర చారి, దామరపల్లి పరమాత్మయ్య, కొత్వాల రాజయ్యను సంగీత కళాజ్యోతి అవార్డులతో సత్కరించి సన్మానించారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

రామగుండం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంతో పాటు ఆటపాటలతో విద్యాబోధన చేపట్టాలని జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్ అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి రైతు భవన్‌లో శుక్రవారం అంతర్గాం, పాలకుర్తి మండలాల అంగన్‌వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రీ స్కూల్ విద్యాబోధనపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, బ్లాక్ కోఆర్డినేటర్ హనీఫ్, స్రవంతి, సూపర్‌వైజర్లు పుష్పలత, సువర్ణ, అంజలి ఉన్నారు.

ఆశన్నపల్లెలో కళాజాత

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఆశన్నపల్లెలో శుక్రవారం తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, జిల్లా పౌర సంబంధాలశాఖ నేతృత్వంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కళాకారులు మల్లేశ్, రాజనర్సు, రమాదేవి, శ్రీవల్లి, వెంకన్నగౌడ్, రేణుక, శంకర్‌గౌడ్, పద్మ, శ్రావణ్ పాల్గొన్నారు.

గుంపులలో శ్మశానవాటిక కూల్చివేత

ఓదెల: మండలంలోని గుంపులలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి శ్మశానవాటికను కూల్చివేశారు. ఉపాధిహామీ పథకం కింద రెండేళ్ల క్రితం రూ.12లక్షలతో శ్మశానవాటిక నిర్మించారు. సంఘటన స్థలాన్ని ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో భాస్కర్ పరిశీలించారు. శ్మశానవాటిక కూల్చివేతపై కార్యదర్శి నవ్య పొత్కపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధ్యతలు స్వీకరణ

ఓదెల: ఓదెల ఆర్‌ఐగా రమేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పనిచేసిన ఆర్‌ఐ మంథనికి బదిలీ కాగా రమేశ్ మంథని నుంచి ఓదెలకు వచ్చారు.

రోడ్డు వెడల్పునకు శ్రీకారం

సుల్తానాబాద్: పట్టణంలో పలు వీధుల్లో ఆక్రమణలకు గురైన రోడ్డు వెడల్పునకు అధికారులు శ్రీకారం చుట్టారు. శివాలయం నుంచి శాంతినగర్‌కు వెళ్లే రహదారి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న గోడలు, గృహాలను, షెడ్లను శుక్రవారం తొలగించారు. భవిష్యత్‌లో మున్సిపాలిటీకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఆక్రమించిన రోడ్లను తొలగిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వాటిని మాత్రమే తొలగిస్తున్నామని, మున్సిపల్ అభివృద్ధికి అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి కోరారు. నాయకులు రాజమల్లు ఉన్నారు.

మట్టి నమూనాల సేకరణ

జూలపల్లి: మండలంలోని నాగులపల్లెలో రైతుల వ్యవసాయ క్షేత్రాల నుంచి మట్టి నమూనాలను వ్యవసాయశాఖ అధికారులు సేకరించారు. సాయిల్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ 2024–25కు గాను జూలపల్లి మండలం ఎంపికైంది. 20,747 ఎకరాలకు గాను 4088 ఎకరాల్లో మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రత్యూష పేర్కొన్నారు. ఏఈవో కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన వరదనీరు



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ సంతోష్‌నగర్ రోడ్డుపై వరదనీరు నిలిచింది. శుక్రవారం కురిసిన భారీ వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. నాలాలు, మురికి కాలువల్లో నిండిపోయిన చెత్తను తొలగించకపోవంతోనే వరదనీరు రోడ్డుపైకి వస్తోందని స్థానిక ప్రజలు అంటున్నారు. వర్షాకాలం దృష్ట్యా నాలాలను, మురికి కాలువలను శుభ్రం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


గోదావరిఖని: యోగా చేస్తున్న జీఎం చింతల శ్రీనివాస్, అధికారులు


రామగుండం: తబితా ఆశ్రమంలో చిన్నారుల యోగా సాధన


జ్యోతినగర్: యోగా చేస్తున్న విద్యార్థులు

యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం

గోదావరిఖని: నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణం ఆరోగ్యంగా జీవించవచ్చని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఆర్జీ–2 ఏరియాలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా ఆసనాలు చేసి అందరూ ఆచరించాలని కోరారు.

పెద్దపల్లిరూరల్: జిల్లా న్యాయస్థానం ఆవరణలో యోగా దినోత్సవం నిర్వహించారు.

రామగిరి: నిత్యం యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జేఎన్‌టీయూ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

కమాన్‌పూర్: మండలంలోని గుండారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేసిన యోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరమణారావు ఆధ్వర్యంలో జాతీయ యోగా డే నిర్వహించారు.

సుల్తానాబాద్: ఇండియన్ పబ్లిక్ స్కూల్, కోర్టు ఆవరణలో యోగా చేశారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలో యోగా ప్రదర్శన చేశారు.

ధర్మారం: మండల కేంద్రంతో పాటు నంది మేడారంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం యోగాదినోత్సవం నిర్వహించారు.

రామగుండం: పట్టణంలోని తబితా ఆశ్రమంలోని చిన్నారులతో ఆశ్రమ నిర్వాహకుడు వీరేందర్ నాయక్ యోగా సాధన చేయించారు.

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు, సిబ్బందితో కలిసి వారు యోగా ఆసనాలు చేశారు.

జ్యోతినగర్: పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతి ఫంక్షన్ హాలులో యోగా చేశారు.

మంథని: మంథనిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జెడ్పీచైర్మన్ పుట్టమధు యోగా చేశారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

గోదావరిఖనిటౌన్: స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు.

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని భూంనగర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ ఆధ్వర్యంలో, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా చేశారు.

ఓదెల: మండలంలోని గ్రామాల్లో యోగా చేశారు.

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 9వ తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు.

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారం, పాలకుర్తి మండలం ఎల్కలపల్లి ఎఫ్‌సీఐ జిల్లా పరిషత్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో అధికారులు యోగా చేశారు.


రామగిరి: యోగా చేస్తున్న జీఎం సుధాకర్‌రావు


ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్ఎఫ్‌సీఎల్‌లో..


కమాన్‌పూర్: గుండారం ప్రభుత్వ పాఠశాలలో..


గోదావరిఖనిటౌన్: యోగా చేస్తున్న విద్యార్థులు

పక్కా ప్రణాళికతో పల్లెల అభివృద్ధి


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: నియోజకవర్గంలోని పల్లెలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వలలో రూ.10లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు, బొంపల్లిలో రూ.10లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లతో పాటు ఇతర గ్రామాలకు అనుసంధానం చేసే రోడ్లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, ఎంపీటీసీలు రుక్కమ్మ, ఎడెల్లి శంకర్, నాయకులు పెగడ రమేశ్, ప్రదీప్, తిరుపతి, గుర్రాల రాజు, జగదీశ్, సలేంద్ర రాజయ్య పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పోచమ్మ బోనాలు, మడేలేశ్వరస్వామి పట్నాల ఉత్సవాల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నకేశవ బ్రహ్మోత్సవాలు

ఓదెల: మండలంలోని కనగర్తి చెన్నకేశవ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు శుక్రవారం పూజలు చేశారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోదావరిఖని: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి సూచించారు. స్థానిక ఇందిరానగర్ ప్రజలతో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలపై జరుగుతున్న నేరాల గురించి వివరించారు. సైబర్ నేరగాళ్లు కొత్త తరహా నేరాలకు పాల్పడుతూ మోసం చేస్తున్నారన్నారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ చెప్పొద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కు కాల్ చేసి చెప్తే న్యాయం జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఎస్సై సుగుణాకర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

స్వీయ రక్షణ.. యోగా శిక్షణ

జ్యోతినగర్: స్వీయ సంరక్షణ..యోగా శిక్షణ ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు దీప్తి మహిళా సమితి ఉపాధ్యక్షురాలు జ్యోత్స్న త్రిపాఠి అన్నారు. టెంపరరీ టౌన్‌షిప్‌లోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్టీపీసీ రామగుండం ప్రభావిత, పునరావాస గ్రామాలకు చెందిన పలువురు నిరుద్యోగులకు మూడునెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు టీషర్టులు అందించారు. జనరల్ మేనేజర్ అలోక్ త్రిపాఠి, ప్రధానోపాధ్యాయుడు జయరాజ్, సీఎస్సార్ ప్రతినిధి యుగంధర్‌రావు పాల్గొన్నారు.


టీషర్టులు పంపిణీ చేస్తున్న త్రిపాఠి

ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు నివాళి

మంథని: తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి మంథని డివిజన్‌లో నిర్వహించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీపీ కొండ శంకర్ జయశంకర్ సార్ చిత్రపటానికి నివాళి అర్పించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి మంథని విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. మంథని విద్యార్థి యువత కార్యాలయంలో ఉద్యమ సంస్థ వర్థిల్లు తెలంగాణ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

జూలపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి మండల కేంద్రంలో నిర్వహించారు. మండల స్వర్ణకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.


మంథని: నివాళి అర్పిస్తున్న ఎంపీపీ శంకర్

సంక్షిప్త వార్తలు

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్, ఎస్సై రవిప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శేఖర్, అఖిల్, మల్లేశ్, సునీల్‌తో కలిసి దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా ఏడుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.16,080 నగదు, ఆరు మొబైల్స్, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకొని జూలపల్లి పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. 13మందిపై కేసు నమోదు చేసినట్లు జూలపల్లి ఎస్సై శ్రీధర్ పేర్కొన్నారు.

ముత్తారంలో ఇసుక డంప్ సీజ్

ముత్తారం: ముత్తారంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సమీపంలో నిల్వ చేసిన ఇసుక డంప్‌ను శుక్రవారం రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులు పట్టుకున్నారు. ముత్తారానికి చెందిన ఓ ప్రతిపక్ష, అధికార పక్షం నాయకులు మానేరులో జేసీబీలతో లారీలో ఇసుక తరలించే ఫొటోలను గురువారం అర్ధరాత్రి స్థానికులు కలెక్టర్‌కు పంపారు. ఈ ఘటన పై స్థానిక అధికారులు స్పందించక పోవడంపై ఫిర్యాదుదారులు పట్టుపట్టడంతో రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఆ ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. మానేరు నుంచి సుమారు 8లారీలకు పైగా ఇసుకను తరలించి ముత్తారం కేజీబీవీ ఎదుట నిల్వ చేయగా రెవెన్యూ ఆర్‌ఐ భవాని ప్రసాద్, మైనింగ్ ఆర్‌ఐ వెంకటగిరి, కార్యదర్శి సంతోష్ పట్టుకున్నారు.

ఎల్‌వోసీ అందజేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం మారేడుగొండ గ్రామానికి చెందిన మాదిరెడ్డి తిరుమల్‌రెడ్డికి రూ.2.50లక్షల ఎల్‌వోసీ చెక్కును ఎమ్మెల్యే విజయరమణారావు అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందించారు. నాయకులు ప్రదీప్ తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వకీల్‌పల్లి మైన్ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టూటౌన్ ఎస్సై వెంకటేశ్, కానిస్టేబుల్ పూర్ణచందర్ పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో వకీల్‌పల్లి మైన్ సమీపంలోని రోడ్డుపై నిలిచి ఉన్న రెండు ఇసుక ట్రాక్టర్లను గమనించి వివరాలు అడిగారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను గుంజపడుగు నుంచి యైటింక్లయిన్‌కాలనీకి తరలిస్తున్నారని తెలపడంతో ఇసుకతో నిండి ఉన్న ట్రాక్టర్లను, డ్రైవర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పుట్ట మధుకు మతిభ్రమించింది

ముత్తారం: మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబు చేసిన అభివృద్ధిని చూస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌కు మతిభ్రమించి మాట్లాడుతున్నడని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అన్నారు. ముత్తారంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకొనేది లేదన్నారు. పీఏసీఎస్ చైర్మన్ యాదగిరిరావు పాల్గొన్నారు.

వర్కర్స్ కాలనీల్లో కార్మికసంఘం పర్యటన

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీలో విధులు నిర్వహించే కార్మికులు నివాసముండే ఎల్, ఎం, ఈ, జి, హెచ్ టైపు కాలనీల్లో శుక్రవారం కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు పర్యటించారు. అధ్యక్షుడు కౌశికహరి, ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్‌తో పాటు వారి మద్దతుదారులు, కార్మికులు ఆయా కాలనీల్లో పర్యటించి కార్మిక కుటుంబాలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాదాసు శ్రీనివాస్, కౌశికహరిని స్థానికులు సత్కరించారు. నాయకులు దారం తిరుపతిరెడ్డి, రమేశ్, బత్తిని సతీశ్, కమలాకర్‌రెడ్డి, రవికుమార్, మనోజ్, రమేశ్ పాల్గొన్నారు.

బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ జెడ్పీహెచ్ఎస్, అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సుచరిత బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన కల్పించారు.

ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధిపై దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్లు ఎన్విరాన్‌మెంట్ కార్పొరేట్‌జీఎం జీవీఎల్ గణపతి తెలిపారు. రామగుండం రీజియన్‌లోని అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి ప్రభావిత గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాల గురించి చర్చించారు. ప్రభావిత గ్రామాల్లో చేపట్టాల్సిన సీసీరోడ్లు, మరమ్మతు, ఆర్‌డబ్ల్యూహెచ్ ఫిట్స్, వర్షం నీటికి సంబంధించిన హార్వెస్ట్ ఫిట్ నిర్మాణ పనులు, సోలార్ వీధి దీపాలు, చెట్ల పెంపకం తదితర అంశాలపై చర్చించారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుజరాత్ విధానాన్ని కొనసాగించాలి


మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

గోదావరిఖని: బొగ్గు బ్లాకుల వేలంలో గుజరాత్‌లో అనుసరించిన విధానాన్ని సింగరేణిలో కొనసాగించాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. బొగ్గు బ్లాకుల వేలంపై వచ్చేనెల 3న హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మేధావులు, ట్రేడ్‌యూనియన్లతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 24 నుంచి జూలై 3లోపున సింగరేణిలోని అన్ని గనులపై గేట్ మీటింగ్‌లు నిర్వహించడంతోపాటు, కొత్తగూడెం, భూపాలపల్లి, శ్రీరాంపూర్, గోదావరిఖనిలో ప్రెస్‌మీట్లు నిర్వహించి విస్తృత ప్రచారం చేయాలని తీర్మానించారు. నాయకులు రియాజ్ అహ్మద్, జె.నారాయణ, ఐ.కృష్ణ, ఇ.నరేశ్, గట్టయ్య, కుమారస్వామి, రాములు, రాయమల్లు, రామకృష్ణ, రాజేందర్, ఏడుకొండలు, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన

రామగిరి: కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను ప్రయివేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ ఆర్జీ–3 పరిధిలోని ఏఎల్‌పీ గని వద్ద హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బ్రాంచ్ సెక్రటరీ కిరణ్, అశోక్, రంజిత్, శ్రీకాంత్, శాంతిస్వరూప్, మహేందర్, రవి, మారుతి, శేఖర్, ఖాన్, బీరయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల ఉత్తర్వులు అందజేత

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలోని వివిధ గనులు, విభాగాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు అనారోగ్య కారణాలతో మెడికల్ అన్‌ఫిట్ అయ్యారు. వివిధ కారణాలతో పలువురు మృతి చెందారు. కాగా వారి పిల్లలకు శుక్రవారం ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ రామచంద్రారెడ్డి, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, అధికారులు సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, గుర్రం శ్రీహరి, సునీల్ ప్రసాద్ పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న జీఎంలు

బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు కేటాయించాలి

రామగిరి: దేశంలోని బొగ్గు బ్లాకులను ప్రయివేటు పరం చేయకుండా సింగరేణి సంస్థకు కేటాయించాలని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సెంటనరీకాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు బ్లాకులను ప్రయివేటు పరం చేయడానికి వేలం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సింగరేణి సంస్థను, ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందన్నారు. ఆర్జీ–3 ఏరియాలో మ్యాన్ పవర్‌ను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. నాయకులు మర్రి ఓదెలు, నరేడ్ల శ్రీనివాస్, సందేల కుమారస్వామి, ఉయ్యాల కుమారస్వామి, జక్కుల దామోదర్, రవీందర్, మంగయ్య, కొమురయ్య, ప్రభాకర్, సదానందం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోట రవీందర్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి

గోదావరిఖని: రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే అప్పగించాలని ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్జీ–1 ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై నల్లబ్యాడ్జీలు ధరించి వినతిపత్రాలు అందజేశారు. బ్లాకులను వేలం వేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకొని సింగరేణికి అప్పజెప్పేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలన్నారు. నాయకులు రంగు శ్రీనివాస్, సంకె అశోక్, మాదన మహేశ్, ఎస్.వెంకట్‌రెడ్డి, బొగె సతీశ్‌బాబు, దొంత సాయన్న, నాయిని శంకర్, చెప్యాల భాస్కర్, మానాల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, పి.నాగేంద్రకుమార్, చంద తిరుపతి, మోదుగు సంపత్, బలుసు రవి, రాజబాబు, మల్లేశ్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎస్సీ, ఎస్టీల సమస్యలపై కలెక్టర్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు మాట్లాడారు. దళిత వర్గాలకు ఉపయోగపడే సివిల్ రైట్స్ జిల్లాలో తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారన్నారు. నాయకులు మంతెన లింగయ్య, కొంకటి లింగమూర్తి, రవీందర్‌కుమార్, బొందయ్య, లక్ష్మయ్య, సందీప్, గణపతి, అశోక్ ఉన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి


యైటింక్లయిన్‌కాలనీ: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 24న కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంత చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్జీ–2 ఏరియా పోతనకాలనీ డివిజన్‌లో పనిచేస్తున్న వివిధ సెక్షన్ల కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు రాజేశం, వెంకటస్వామి, నగేష్, శంకర్, ఎల్లక్క, పద్మ, దుర్గయ్య, దుర్గమ్మ, ప్రకాశ్, రాజక్క పాల్గొన్నారు.

మంత్రిపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు

పాలకుర్తి: కాళేశ్వరం ఎస్సై విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శీనుబాబుపై జెడ్పీ చైర్మన్ పుట్ట మధు చేసిన అసత్య ఆరోపణలను ఖండిస్తున్నట్లు డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య తెలిపారు. బసంత్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమ్మయ్య మాట్లాడారు. పాలకుర్తి మాజీ సర్పంచ్ దుర్గం జగన్, కేశోరాం ఎంప్లాయిస్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎండీ.ఫయాజ్, కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ఇబ్రహీం, తలారీ శంకర్ పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

ముత్తారం: మండలంలోని మచ్చుపేటలో శుక్రవారం వర్షాలు కురవాలని కప్పతల్లి ఆడారు. కప్పతల్లి ఆటకు ముందు గ్రామంలోని అపరకాశీ పేరున్న భగుళ్లగుట్టలో కాశీజలాలతో కప్పతల్లి ఆటకు పూజలు చేశారు. తర్వాత భగుళ్లగుట్ట కాశీ జలాలను బిందెలతో, గ్రామంలో డప్పుచప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. వర్షాలు కురవాలని స్థానికులు పూజలు చేశారు.


కప్పతల్లి ఆడుతున్న స్థానికులు